

# ఖర్వాటోపాఖ్యానం

పి.వి.బి. శ్రీరామమూర్తి

"ప్రియమైన పాఠకులారా!

"నలోపాఖ్యానం చదివాం. కుచేలోపాఖ్యానం చదివాం. కానీ, ఈ 'ఖర్వాటో పాఖ్యానం' ఎప్పుడూ చదవలేదని, వినలేదని, ఆశ్చర్య పోతున్నారా? దీనికి ఆధారం ఏ పురాణం లోనిదని మీ సందేహమా?

"కాదండీ!

"ఇది ఏ పురాణం నుండీ గ్రహించబడలేదు.

"ఏ భారతీయ భాష గానీ, మరే విదేశీ భాషా సాహిత్యం గానీ దీనికి ఆధారం ఎంత మాత్రం కాదని మీకు హామీ ఇస్తున్నాను.

"ఇది కేవలం ఒకానొక బ్యాంకులో కేషియర్‌గా పనిచేస్తున్న మా 'సూర్యారావు'ని ఆధారంగా చేసుకుని మాత్రమే రాయబడింది.

"ఇక చదవండి!

సూర్యారావు డ్రెస్సింగ్ టేబిలు ముందు నిలబడి స్టైయిలుగా దువ్వెనతో తల దువ్వుకున్నాడు. జుట్టును రెండు నొక్కులు నొక్కి, నుదుటిపై 'శోభన్‌బాబు' లాగ ఓ రింగ్‌ను దిద్దు కున్నాడు.

టక్ సవరించుకున్నాడు.

హుషారుగా ఈల వేసుకుంటుంటే నిన్న బ్యాంకులో సుజాత అన్న మాటలు గుర్తొచ్చాయి.

"ఏమిటి సార్! ఆ నెత్తి మీద వెంట్రుకలు పూర్తిగా రాలిపోతే కానీ మాకు పప్పన్నం పెట్టరా?" అంది.

"నిజమేలాగుంది. ఏమిటోయ్, సూర్యారావూ! వెనకాతల పాత నయాపైస పరిమాణంలో సుడి కనిపిస్తోంది. బుర్రమీద. బట్టతల కానీ వచ్చేస్తోందేవిటోయ్?" అన్నాడు హెడ్ క్యాషియర్.

"అబ్బెబ్బె. నాకు బట్టతలేమిటిసార్? భలే వారే! ఆవిడేదో నన్ను జోక్ చెయ్యబోతే మీరు నిజంగా ఆవిడని సమర్థించటం బాగోలేదు్సార్!" అనేసి, వెనుక జేబులో నుంచి దువ్వెన తీసి జుట్టు నోసారి సవరించుకున్నాడు.

అతని కిప్పుడా మాటలు గుర్తుకొచ్చాయి.

అంతే కాదు.

నిన్న బ్యారికు రద్దీగా లేక పోవడం చేత - ఏదో నవల పట్టుకొని కౌంటర్‌లో కూర్చుని చదూకుంటున్న వాడు, ముందు కౌంటర్‌కు కాళ్ళు దన్ను పెట్టి, వెనుక గాడ్రేజ్ కుర్చీకి తల ఆన్చి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. అప్పుడు తల వెనుక భాగానికి ఇనుపకుర్చీ చల్లగా తగిలింది. చూస్తే కుర్చీకి తడి కనిపించలేదు. హెడ్ కేషియర్ అన్న మాటలు గుర్తొచ్చి జుట్టుని పక్కకు జరిపి వేళ్ళతో తడిమి చూసుకున్నాడు.

మళ్ళీ చల్లగా తగిలింది!

ఇంతకు ముందెన్నడూ అలా అనిపించలేదు.

కొంప తీసి బట్టతల కానీ రావటం లేదుకదా!

ఆ భావన కలిగినప్పుడే అతనికి వెన్నులోంచి చలిలాంటిది ప్రవేశించింది.

ఇప్పుడది గుర్తొచ్చింది.

గడ్డం చేసుకోవడానికి వాడుకునే చిన్న అద్దం తల వెనుక భాగం కనిపించేటట్లు బుర్రవంచి డ్రెస్సింగ్ టేబిలు అద్దంలో చూసుకున్నాడు.

నిజమే!

ఇంతకు ముందు నుంచీ ఉన్నదే, కొత్తగా వస్తోందో తను చూసుకోలేదు గానీ - నయా పైసా పరిమాణంలో తెల్లగా కనిపిస్తోంది. మరోసారి తల దువ్వుకున్నాడు. పర్శు మీద మూడో, నాలుగో తల వెంట్రుకలు రాలి పడ్డాయి. ముందు భాగం కూడా ఇంతకు ముందులా ఒత్తుగా కనిపించడం లేదు. ప్రక్కలు మీదకు పోతున్నాయి తల భాగంలో. ఖాళీగా తెల్లగా కనిపిస్తున్నాయి.

సూర్యారావు వానిషింగ్ క్రీమ్ రాసుకోడం వల్లనో బట్టతల వస్తోందన్న భయం వల్లనో తెలీదు గానీ ముఖం అంతా ఆవిరి పట్టినట్లయింది.

అమ్మో! కొంపతీసి బట్టతల గానీ రాదుకదా!

బట్టతల గానీ వస్తే -

అక్కినేని నాగేశ్వరరావులాగా వచ్చేస్తుందో, కొంగర జగ్గయ్య లాగ వచ్చేస్తుందో, కృష్ణ లాగ వచ్చేస్తుందో, కిర్మాని లాగ వచ్చేస్తుందో? త్వరగా మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేసుకోవాలి!

'ఆలస్యం చేస్తే బట్టతల పెరిగి పోవచ్చు. మంచి పిల్ల దొరక్క పోవచ్చు. వచ్చినా, తనాశించిన వరాలేవీ ఫలించక పోవచ్చు.' అనుకుంటూనే అతను స్కూటర్ తీసుకొని బేంకు కెళ్ళాడు.

ఆ తరువాత మూడు నెలలు గడిచాయి.

మూడు నెలల్లో చాలా మంది నోట విన్నాడు. "ఏంటిసార్! జుట్టు బాగా పల్చబడి పోతోందే? వెనకాల బాగా కనిపించేస్తోంది!" అంటూ ఎవరో ఒకరు ఏదో ఒకసందర్భంలో అనటంతో అతనిలో బట్టతల గురించిన ఆవేదన కర్ణుని తొడలో ఇంద్రుడు పురుగై దొలిచినట్లు దొలిచేస్తోంది.

ఇవ్పుడద్దంలో చూనుకుంటే 'రూపాయి' బిళ్లంత సైజులో బట్టతల కనిపిస్తోంది. ఈ దశలో సూర్యారావు బాల్య మిత్రుడు అనుకోకుండా తటస్థించాడు. అతడు సూర్యారావుని చూస్తూనే "ఏంట్రా? ఆ నొక్కుల జుట్టేమయింది? అబ్బ! ఎంత ఒత్తుగా ఉన్న జుట్టు ఎంతగా పలచగా అయి పోయింది? "అనటంతో సూర్యారావుకి మనసునిండా దిగులు మళ్లీ అలముకుంది.

అతనిప్పుడు సినిమాకెళ్లినా, టిఫెన్ కెళ్లినా, బేంకు కెళినా, బన్సు స్టాపులో నిల్చున్నా అతన్ని మరువనివ్వకుండా మనసు నిండా 'బట్టతల' వచ్చేస్తోందేమోనన్న దిగులే!

అతనికిపుడు భోజనం మీద కూడా ధ్యాన పోవటం లేదు.

పోనీ - విషయం మరచి పోదామని సినిమా కెళ్తే అతని ముందు సీట్లో తలమీద ఒక వెంట్రుక కూడా లేని వ్యక్తి కనిపించి సినిమా చూడనివ్వకుండా చేశాడు. టీ.వీ. ముందు కూర్చుని క్రికెట్ చూడబోతే - అందులో ఆటగాడి నెత్తి మీద హెల్మెట్ పెట్టుకున్నట్లు వెన్నెలలో బండరాతిలా మెరిసి పోతూ, అతని భయాన్ని రెట్టింపు చేసింది.

స్కూటర్ మరమ్మతు కెళ్లటం వల్ల సిటీ బస్సు కోసం స్టేజీలో ఎదురు చూస్తున్నాడు. అక్కడికో వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. అతనో ఆఫీసరులాగా ఉన్నాడు. తెల్లగా, దృఢంగా, ఎత్తుగా ఉన్నాడు. కళ్లు పెద్దవిగా ఉన్నాయి. మీసాలు బొద్దుగా ఉన్నాయి.

విచిత్రం!

జుట్టు మాత్రం తేలికగా లెక్క పెట్టే విధంగా ఉంది.

అతన్ని చూస్తే సూర్యారావ్‌కి గొప్పజాలేసింది. ఎందుకో అతన్ని పలకరించాలనిపించింది. ఎలా పలకరించాలో తెలీలేదు.

"సిరిపురం జంక్షన్‌కి బస్సు లేమన్నా ఉన్నాయా సార్?" అన్నాడు.

"రావాలి!" ముక్త సరిగా అన్నాడతను.

"మీ రెక్కడకెళ్లాలిసార్?"

చెప్పాడతను.

"ఏంటో సార్! సైన్సెంతగా పెరుగుతోంది. ఏ జబ్బుకీ మందును కనిపెట్టలేక పోతున్నారు" అన్నాడు. అతను సూర్యారావు వైపు విచిత్రంగా చూశాడోసారి.

"అవున్సార్! కేన్సర్‌కి మందు లేదు. ఎయిడ్స్‌కి మందు లేదు. షుగర్ వ్యాధికి మందులేదు. అంతెందుకు సార్? బట్టతల వస్తే జుట్టు రావటానికి మందు కనిపెట్టలేక పోతున్నారు. చంద్రమండలం మీద అడుగు పెడ్తున్నారు. మానవ వినాశనానికి న్యూక్లియర్ బాంబులు కనిపెడ్తున్నారు. దేనికి సార్? మనిషికి ఉపయోగపడని సైన్సు దేనికి సార్?" అని ఉపన్యాసం ఇస్తుంటే అతను సూర్యారావు ఆవేదన అర్థం చేసుకున్నట్లుంది చిరునవ్వు నవ్వాడు.

"సార్! మీ వయసు మహా ఉంటే ఫార్టీ దాటుతుంది. మీకింతలా బట్టతల వచ్చినంత వరకూ మీరేం చేశార్ సార్?" అడిగాడు సూర్యారావు.



## అమ్మో భార్యలూనా?

సత్యనారాయణ: నిన్న నేను మళ యాళ సినిమా చూద్దామని వెళ్లాను. కానీ సిన్మా సగంలో స్పృహతప్పి నంత పనైంది.

నాగరాజు: ఏం, అంతా సెక్సా...?

సత్యనారాయణ: ఛ! అది కాదు. ఆ సినిమా కొచ్చిన నా భార్యామణిని చూసి...

నాగరాజు:"....."

ముద్దా రమణమూర్తి (అనంతపురం)

---

"ఏం చేశాను నా బొంద! రోజూ ఎన్నేసి వెంట్రుకలు ఊడి పోతున్నాయో లెక్క పెడుతూ కూర్చున్నాను" అన్నాడు చిరాగ్గా.

"ఆ జుట్టే ఉంటే మీది కృష్ణంరాజు పర్సనాలిటీ సార్!" అన్నాడు కొంచెం చిరాకు పడుతోన్న అతగాడు ఆ పొగడ్తకి మరి కొంచెం పొడుగ్గై, చిరాకును దిగమింగుకున్నాడు.

"సార్! మీ వంశంలో ఎవరికైనా బట్టతల ఉందాసార్?" అలాంటి ప్రశ్నలు తన నోట ఎందుకొస్తున్నాయో తనకే అర్థంకావటం లేదు సూర్యారావుకి.

"ఏమోనయ్యా! నేనెప్పుడూ దాని గురించి ఆలోచించ లేదు."

"పోనీ, మీకు పెళ్లికి ముందు బాగా జుట్టు ఉండి ఉండాలి అవునా?"

"ఏంటయ్యా! నీ గొడవ. అసలింతకీ నీకేం కావాలి?" విసుక్కున్నాడతను. సూర్యారావు కొంచెం తడబడ్డాడు.

"అదికాద్సార్! ఈ జుట్టు రాలకుండా ఉండేందుకు మీరొకవేళ మందువాడినా ప్రయోజనం లేకపోయిందా? లేక వాడక పోవటం వలన జుట్టూడిపోయిందో తెలిస్తే - నేనూ జుట్టు రాలకుండా ఏదయినా వాడదామని" అన్నాడు.

అతనికి నవ్వూ వచ్చింది, జాలీ వేసింది, కోపమూ వచ్చింది సూర్యారావు మీద. "చూడు మిస్టర్! కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు మనవాళ్లు. కానీ మనం తల్చుకుంటే ఆ రెంటినీ ఆపొచ్చు. కానీ ఈ 'బట్టతల' అంటూ వస్తే - దీన్నాపటం ఆ బ్రహ్మతరం గాదు" అని అంటుండగానే ఓ సిటీ బస్సు రావటం, అతను ఎక్కేయటం జరిగిపోయింది. ఎందుకో ఆ బస్సు ఎక్కాలనిపించక సూర్యారావు ఆగిపోయాడు. ఆ వెనకాలే మరో సిటీ బస్సు వచ్చింది. అదీ సిరిపురం జంక్షన్ వైపు వెళ్లేదే!

బస్సు ఖాళీగా ఉంది.

సూర్యారావు ఎక్కేశాడు బస్సు.

అతని మనసు ఏదోలా ఉంది. బస్సు రద్దీగా లేదు. కండక్టరు బుర్ర వేపు చూశాడు. బుర్రనిండా జుట్టుంది. డ్రైవర్ని చూశాడు తుమ్మ డొంకలాగా ఉంది అతని జుట్టు. సూర్యారావుకి డ్రైవరు మీద, కండక్టరు మీదా గొప్ప కోపంగా ఉంది. ముఖాలు డొక్కుల్లా ఉన్నా డబ్బా కిరసనాయిలు పోసి తగలెట్టినా, ఇంకా మిగిలినంత జుట్టు ఉంది. చివరి సీట్లోకి వెళ్లి పోయి కూర్చున్నాడు.

అక్కడో పల్లెటూరు ఆ సామీ కూర్చున్నాడు.

అతని బుర్రనిండా జుట్టుంది. అతని వేపు చూశాడు.

"ఏం నాయుడూ! నీ జుట్టు ఇంత ఒత్తుగా ఉంది కదా, ఏం రాస్తావ్?" అన్నాడు.

"వేప నూన" అన్నాడా రైతు.

వేప నూనా? అంటే... ఓ....వేపనూనె రాస్తే జుట్టూడదా?" అడిగాడు.

అవునన్నట్టు తలూపాడు రైతు.

నిజమే!

"ఈ నూనెలన్నిట్లో కల్తీయే. ఈ కల్తీ సరకులు.... అదే, ఆ నూనెలు రాయటం నుంచే జుట్టు ఊడిపోతోంది, పోనీ వేప నూనె రాస్తే...?

"ఛీ.... భరించలేం! కంపు!

'కంపయితేనేం? జుట్టూడనపుడు.

"పోనీ, ఓ సారి డాక్టర్ని సంప్రదిస్తే...?"

ఆ సాయంకాలం డాక్టర్ దగ్గర కెళ్లాడు అతని వయసు మహా ఉంటే ఏభై దాటదు. అతనికి చెంపల దగ్గర మాత్రమే జుట్టుంది.

ఛీ! ఇతని దగ్గరికెందుకొచ్చానా?' అనుకున్నాడు. 'పోనీ, వచ్చాను కదా'ని విషయం చెప్పాడు.

అతను పేలవనంగా నవ్వాడు. ఆ నవ్వులో అతను దేన్నో పోగొట్టుకున్న ఛాయలు కనిపించాయి. డాక్టరు తాపీగా అన్నాడు. "చూడు నాయనా! ఆ జుట్టు లేక పోవటం నుండే నా భార్య ప్రేమానురాగాలకు దూరమయిపోయాను. కనీసం ఓ నర్సు అయినా, నా కనుకూలంగా ఉండేదున్తుందని పెట్టుకుంటే అదీ నా డబ్బు తిని, కాంపౌండర్ని ఉంచుకుంది. ఒకటే మార్గం నాయనా! శుభ్రంగా గుండు కొట్టించేసుకో. టోపీ పెట్టేసుకో' అన్నాడు.

అతని సలహా విన్న సూర్యారావుకి ఒళ్లు మండిపోయింది.

టేబిల్ మీదున్న పేపరు వెయిట్‌తో అతని బుర్ర పగల గొట్టాలనిపించింది. తమాయించుకొన్నాడు. సరే, ఏదైతే అదే అయింది. వేప నూనె రాయటానికే సిద్ధమయ్యాడు.

వేపనూనె తెచ్చుకున్నాడు. చేతిలో వేసుకున్నాడు.

అద్దం ముందు నిల్చున్నాడు. విశాల వక్షస్థలం, గుండ్రని భుజాలు, గుండె మీద ఒత్తుగా వెంట్రుకలు, వీపు మీద కూడా దట్టంగా. అద్దంలో అతని ప్రతిబింబం చూస్తే అతని కేడుపొస్తోంది.

ఎక్కడైతే అవసరమో అక్కడే లేవు వెధవ వెంట్రుకలు!

ఒంటి నిండా మాత్రం ఉన్నాయి., చిట్టడివిలా ముక్కూ పుటా లదరగొడుతోంది చేతిలో వేపనూనె.

పున్నమి చంద్రునిలా కనిపిస్తున్న తల వెనుక భాగాన గట్టిగా మర్దన చేశాడు. "ఏడు కొండల వాడా! వెంకట రమణా! నాకీ బట్టతల మీద దట్టంగా జుట్టు వస్తే ఏడుసార్లు వరుసగా వచ్చి తల నీలాలర్పించుకుంటాను" అని మొక్కుకున్నాడు.

వేప నూనె వాననని కప్పి పుచ్చేందుకు సెంట్‌లో మునిగి తేలినట్టు స్ప్రే చేసుకున్నాడు. ఆఫీసు కెళ్లాడు. సూర్యారావు ప్రవేశించే సరికి బేంకంతా అతని వేపనూనె వ్యాపించేసింది.

సుజాత "ఓర్నాయనో! నేను భరించలేనీ కంపు." అంటూ తన సీటులోంచి పరుగెత్తింది. 'ఏమయిందంటే, ఏమయింద'ని అందరూ ఆరాతీస్తే విషయం తేలింది. ఫలితంగా సూర్యారావునింటికి పంపించి షాంపూతో తల రుద్దుకొని రమ్మన్నారు.

బట్ట తల గురించే ఆలోచిస్తూ కూర్చునే సూర్యారావు ఓ సారి అనాలోచితంగా ఓ ఆ సామీకి అయిదు వేలు ఎక్కువిచ్చేశాడు. అంతకు ముందు అనేక సార్లు లెక్కల కూడికల్లో తప్పులు చేశాడు. సూర్యారావు మొదట్లో తప్పనేదే చేసేవాడు కాదు. అతని ధోరణి అర్థంకాని బ్యాంకు మేనేజరు సీటు మార్చేశాడు.

దాంతో సూర్యారావులో ఆత్మవిశ్వాసం దెబ్బతింది.

అతనిలో ఓ 'కాంప్లెక్సు' బయలు దేరింది. "సుజాత గానీ, సుశీల గానీ ఇప్పుడు తనతో అసలు ఇంతకు ముందులా మాట్లాడట్లేదు. తనకి జూనియర్ సుబ్బారావుతోనే తరచుగా మాట్లాడుతున్నారు.

"ఈ జుట్టు ఇలాగే ఊడిపోతుంటే, రేపు పెళ్లయినా, పెళ్లాం కూడా తనతో సరిగా మాట్లాడుతుందా?" ఈ ఆలోచనలు రాగానే భరించలేక పోతున్నాడు.

అతను బస్సులో వెళ్లినా నడుస్తున్నా ఎంత మందికి బట్టతలలు ఉన్నాయో, ఏరకమైన బట్టతలలు ఉన్నాయో చూస్తుంటాడు. లెక్క గడుతుంటాడు.

అతను పని చేస్తోన్న బ్యాంకు మేనేజరు మారి పోయాడు.

క్రొత్తయన వచ్చాడు. అందరూ పరిచయం అవుతున్నారు.

"అయాం సూర్యారావు" సూర్యారావు పరిచయం చేసుకొని అతని వేపు చూశాడు. ఆంతే!" వాఁ..." అని అరిచాడు. అందరూ సూర్యారావుని చూశారు. "ఏమయింది?" అన్నాడు బి.ఎం.

సూర్యారావుకి చెమటలెక్కాయి.

బి.ఎంకి తల మీద ముందు భాగాన గొడుగు కర్రలా రెండే రెండు వెంట్రుకలున్నాయి. వాటిని చూసిన సూర్యారావు తనకీ అలానే అయిపోతుందేమోనన్న భయం వేసింది. అప్రయత్నంగా అరిచేశాడు.

"ఏమయింది?" గద్దించాడు బి.ఎం. సూర్యారావు జవాబు చెప్పలేదు.

"గెటౌట్" - గెటౌట్" అరిచాడు మానేజరు. సూర్యారావు తలదించుకొని వెళ్లి పోయాడు అక్కణ్ణుంచి. అక్కణ్ణుంచి ఆతను మరీ డీలా పడిపోయాడు.

ఓ రోజు పేపరు చదుతున్నాడు.

అతని కళ్లు అప్రయత్నంగా ఓ ప్రకటన మీద నిలిచి పోయాయి. ఆ ప్రకటన ఇది. "మీరు బట్టతలతో బాధ పడ్తున్నారా? బాధపడకండి వెంటనే ఈ దిగువ చిరునామాకు నూర్రూపాయలు పంపండి! మీ బాధను తొలగించుకోండి." అని.

సూర్యారావు ఎగిరి గంతేశాడు.

వెంటనే పోస్టాఫీసు కెళ్లి నూర్రూపాయలు ఎం.ఓ చేశాడు. తిరిగి వచ్చాడు. 'వెంకన్న సామీ! ఇది నీ చలవే. తప్పక ఏడుసార్లు తల నీలాలర్పించుకుంటాను. సుజాత నన్నే ప్రేమిస్తుంది. సుశీల నా చుట్టూనే తిరుగుతుంది" ఆనంద తరంగాల్లో తేలియాడాడు.

వారం రోజులు అయింది.

ఓ రోజు పోస్టులో, రిజిష్టరు బుక్ పోస్టులో ఓ చిన్న పుస్తకం వచ్చింది. ఆత్రుతగా అందుకున్నాడు. వాలుకుర్చీలో ముందుకూ వెనక్కూ ఊగాడు. పుస్తకం తెరిచాడు.

"మీకు బట్టతలా? ఈ క్రింది కారణాల్లో ఏదో తేల్చుకోండి.

మీ ఇంట్లో మీ నాన్నకు గానీ, తాతకు గానీ బట్టతల ఉందా? ఉంటే అది వంశపారంపర్యంగా మీకూ వస్తుంది. అలాగైతే తప్పించలేం!

మీ తలకు చుండ్రు పట్టిందా? అలాగైతే ఈ దిగువ మందు మా దగ్గర లభ్యం అవుతుంది. పాతిక రూపాయలు ఎం.ఓ చేయండి పంపుతాము.

మీ తలకు 'ఉరిడి పోటు' పెడుతున్నదేమో తెల్చుకోండి. ఉదయాన్నే ఉల్లిపాయ, కోడిగ్రుడ్డు పులిమి గంట తరువాత తల స్నానం చేయండి. ఆ తరువాత మా కంపెనీ తయారు చేసే మందార తైలం మర్దనా చేయండి. తైలం కావాలంటే ఏభై రూపాయలు ఎం.ఓ చేయండి.

ఇక.......

మీకు బట్టతల వస్తున్నదనగానే దిగులు రావటం.... మనసు కల్లోల సాగరంలా కలుషితమయి అశాంతితో అలమటించటం సాధారణం. అందుకే మనసు నిర్మలంగా ఉంచుకోండి తరచుగా ఎన్నో అనర్థాలనీ, ఆవేదనలనీ దూరం చేస్తుందీ మంత్రం. 'నగాయత్ర్యా పరం మంత్రం' అన్నారందుకే!

ఇక...

ఈ పుస్తకంలో కొన్ని బొమ్మ లిస్తున్నాం. మీ కున్న బట్టతల బట్టి మీ క్రాఫ్ మార్చుకోండి.

ముందు బాగా వొస్తే - వెనుక నున్న జుట్టు ఇలా, దువ్వెనతో ముందుకు దువ్వుకుని, నుదురు మీద పడేలా సరి చేసుకోండి. మీ ముఖం గుండ్రంగా ఉంటే ఈ రకమైన క్రాపు చాలా అందంగా ఉంటుంది. కోలగా ఉంటే మరో పద్ధతిలో ఇదిగో చూడండి. అక్కడ మరో బొమ్మ.

వెనుక వస్తే..... ముందు జుట్టును వెనక్కు దువ్వుకోండి ఇలాగా ఆ పునకం నిండా ఉన్నాయి.

సూర్యారావుకి గొప్ప కోపం, దుఃఖం వచ్చేశాయి.

పుస్తకాన్ని ముక్క ముక్కలుగా చింపి పారేశాడు.

జుట్టు పీక్కున్నాడు. తువ్వాలు ముఖం మీద కప్పుకొని బావురుమన్నాడు. కళ్లు తుడుచుకున్నాడు.

ఎదురుగా గాంధీ ఫోటో కనిపించింది. "బాపూ! నువ్వు జాతి పితవి - అదుకే వంశపారంపర్యంగా నీ బట్టతల నాకూ వచ్చింది. ఆ పక్కన టోపీతో నెహ్రూ. పక్కనే తలపాగాతో వివేకానందుడు.

[బహుశా ఈయనకీ బట్టతలే కాబోలు అందుకే తలపాగా ధరించాడు స్వామి - సూర్యారావు మనసు ఘోషించింది] మరో ప్రక్క పటేలు. అతనిదీ బట్టతలే. మరో పక్క రాజీవ్ గాంధీ, వి.పి.సింగ్, పి.వి. నరసింహారావు...."అయ్యా! మీ వారసులం మేం. అందుకే మాకు మీలా ఉన్నత పదవులు రాకపోయినా బట్టతలలు మాత్రం వచ్చాయి" సూర్యారావు మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది.

ఎలా? ఎలా? ఈ బట్టతల బాధని తప్పించుకోవటం?

అతనికి వెంటనే నెహ్రూ గారు ఆదర్శంగా కనిపించారు. అతని లాంటిది కాకపోయినా, ఓ ఫేషన్‌బుల్‌గా ఉన్న టోపీ..... ఛార్లీ చాప్లిన్ లాంటిది తెచ్చుకున్నాడు.

అదొక్కటే సరైన మార్గంగా కనిపించింది.

ఇప్పుడు సూర్యారావు బట్టతల కనిపించకుండా 'టోపీ' ఉంది స్టయిలుగా! అతని నెత్తిమీద.

అదండీ ఖర్వాటోపాఖ్యానం అంటే!

ఇది విన్నవాళ్లూ... చదివిన వాళ్లూ సూర్యారావు లాంటి అవస్థలు పడకుండా ఉండాలనీ ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నా [బట్ట తలలు గలవారైతే]



## అదీ దారి

అరుంధతీ భర్త సత్యనారాయణతో ఆఫీసుకు ఫోన్‌లో మాట్లాడుతూ... ఏమండీ! సినెమా కెళ్దాం వస్తారా?" అంది.

"ఆఫీసు పనుంది రాలేను అరుంధతీ!" అంటూ సమాధానమిచ్చాడు సత్యనారాయణ.

"మీ రిలా అంటారని తెలిసి ముందుగానే పక్కింటి నాగరాజు గార్ని రెడీ కమ్మని చెప్పాన్లెండి" అంది అరుంధతీ.

అంతే! సత్యనారాయణ పది నిముషాల్లో ఇంట్లో వాలాడు.

ముద్దా రమణమూర్తి